

# సుడిగుండంలో ముక్కుపుడక

అఖండంగా ప్రవహించే కృష్ణానది గుడికి కొంచెం ఎగువన సుడిగుండంగా మారుతుంది. పలకల రాళ్ళమధ్య నుంచి మెలికలు తిరిగి, కోసురాళ్ళ సందున సుళ్ళు తిరిగి మహావేగంతో పారే ఆ సుడిగుండంలో ఈదటం తెలిసిన వాళ్ళకి గొప్ప సరదా. చింతచెట్లపైన కృష్ణలో దిగితే బారలెయ్యక్కరలేదు, కాలు ఆడించక్కరలేదు. కన్నుమూసి తెరిచేంతలో సుడిగుండంలో కొచ్చేస్తాము. అంతవేగం, ఆ సుడిగుండంలోని సుళ్ళలో ఇరుక్కొని మనమూ సుళ్ళు తిరిగి తిరిగి చుట్టు దాటేంతలో రెండుబారలేస్తే వొడ్డుకొస్తాము. సుళ్ళు మళ్ళీ మళ్ళీ తిప్పేస్తుంటే తిరిగి తిరిగి అందులో ఈతలు కొడ్తారు అక్కడి జనమంతా.

ఘాఘమాసం నాటికి సుడిగుండం ఎండిపోతోంది. పలకరాళ్ళమీద, కోసు రాళ్ళమీద, చట్టుమీద పిడకలు కొడ్తారు. కృష్ణయితే దూరంగా వెళ్ళిపోయిందిగాని ఆ రాళ్ళమధ్య నిలచిన నీళ్ళింకా వున్నాయి. ఆ నిలవ నీళ్ళలో చిన్న చిన్న

చేపలు, కప్పపిల్లలు, వాటిపక్కనే ఓ ఎలికలోళ్ళ జంట; బాచిగాడు, సింగి.

నల్లగా చింతబరికల్లా వున్నారు బాచిగాడు, సింగి. వొంచిన తల ఎత్తలేదు. నడుం నిటారుగా నిలపలేదు. పొద్దుట్నించీ చేటలతో, జల్లెళ్ళతో ఆ నిలవ నీళ్ళు జల్లిస్తున్నారు. రాళ్ళు ఏరుతున్నారు. వొళ్ళంతా కళ్ళు చేసుకుని ఇసుక గాలిస్తున్నారు.

ఉదయం గుళ్ళో తీర్థం బిందె తెచ్చే వేళతో మొదలయి పడమట సూర్యుడు వాటారేదాకా అలా మురుగునీళ్ళు జల్లిస్లున్నారు. నెత్తి మాడుతున్నా పని ఆగలేదు. దాహమేస్తున్నా పని ఆగలేదు. కడుపులో పేగులు కావు కావు మంటున్నా పని ఆగలేదు. చింతచెట్టు కొమ్మన చిరుగుల చీరలో వేళ్ళాడుతున్నా బాచిగాడి ఆర్నెల్ల కొడుకు పాలకోసం కెవ్వుమని ఏడుస్తున్నా పని ఆగలేదు.

సూర్యుడు నడినెత్తికొచ్చి పెటపెటలాడిస్తున్న వేళ సింగి పలకలరాయి పక్కన రెండురాళ్ళు మోపుజేసి నాలుగు చితుకు లేరుకొచ్చి గంజి కాచింది ఆ మంట లోనే. జల్లింపులో దొరికిన చేపపిల్లల్ని ఉప్పుకారంతో నంజుకొందుకు వేయించింది.

"ఇంక సాల్లేవయ్యో దొర! లేచిరా గఁజి తాగుదువు" అని పిలిచింది సింగి. బాచిగాడు జల్లెడ పక్కకి పెట్టి వొళ్ళు విరుచుకున్నాడు. ఇనపచువ్వలాటి శరీరాన్ని కావిడిబద్దలా అటూ ఇటూ వంచాడు. జల్లించినరాళ్ళ గుట్టవైపు చూశాడు. లోతుగా ఉన్న నిలవ నీళ్ళవైపు చూశాడు. ఆ మురుగునీట్లో అతనికి ధనరాసులు కన్పిస్తున్నాయి. విలువైన రాళ్ళకోసం ఆ వేట.

గంజి సమంగా తాగాడో లేదో జల్లెడ, చేట తీసుకుని నీళ్ళదగ్గర కొచ్చాడు. అతడి వెంటే సింగి నడిచొచ్చింది.

దొడ్లో వెండికంచం కడగడానికొచ్చిన సూర్యకాంతం నడి ఎండలో జల్లింపులో మునిగివున్న వాళ్ళిద్దర్నీ చూసింది. సూర్యకాంతానికి తళుక్కున మెరుపులా ఆలోచనొచ్చింది. గబగబా ఇంట్లోకొచ్చి నిబ్బరంగా చుట్ట కాలుస్తున్న

భూమయ్యతో గుసగుసగా చెప్పింది. క్షణాలమీద ఎలికలోళ్ళకి కబురెల్లింది.

వరండా చివర భయం భయంగా వచ్చి నుంచున్నారు బాచిగాడు, సింగి. భూమయ్యగారి పాదాలు తాకడానికి పనికిరారు కాబట్టి "దణ్ణాలు దొరా" అని నేల తాకారు. ఆ నేలతాకిన వంపుకి సింగి చంకన గుడ్డలో వేళ్లాడుతున్న పసిగుడ్డు కెవ్వుమన్నాడు. చటుక్కున వాడి నోరునొక్కింది సింగి.

భూమయ్య పెదవి విప్పకుండా వాళ్ళిద్దర్నీ చూస్తున్నాడు. ఆ చూపుకు వణికి పోతున్నారు ఎలికలోళ్ళు. పగపట్టిన తాచుపాము ఎదురుగా వచ్చి నుంచుని కాలు కాటేద్దామా,వేలు కాటేద్దామా అని చూస్తున్నట్లుంది భూమయ్య చూపు.

"దొంగ నాయాళ్ళలారా!" అని దీవనతో మొదలెట్టి " ఆ గుంటలో మా ఇంటోళ్ళ ముక్కుపుడక దొరికిందటగదరా" అన్నాడు భూమయ్య.

మాడుమీద కట్టెపేడుతో కొట్టినట్టయింది బాచిగాడికి, సింగికి. ఇద్దరూ ముఖాలు ముఖాలు చూసుకున్నారు. "లేద్దొరా" అంటూ నేలమీద కూలబడ్డారు. "దొరా! లేద్దొరా" గిల గిల్లాడ్తున్నట్లు అంటున్నారు.

"దొంగనాయాళ్ళలారా! ఏడుపు లాపండెయ్! ఆ ముక్కుపుడక మా ఇంటోళ్ళకి పుట్టింటోరు పెట్టింది. కిష్ట తగ్గముఖం పట్టినప్పుడు ఆ గుంటలో పడింది. ఆ పుడక లేకపోతే దాని ముఖం కళ తగ్గిపోయింది. మనిషి సగమైంది. తెల్లారేసరికి అది తేకపోయారో ..... ..... " అన్నాడు భూమయ్య. ఇంక చెప్పక్కర్లేదు. అది తేకపోతే భూమయ్య చూపు తమని, తమ గుడిసెని, తమ వంశాన్నే బుగ్గి చేసేస్తుందని వాళ్ళకు తెలుసు.

"పొండెహె" అన్నాడు భూమయ్య.

కందిపుల్లల్లా లేచి నుంచున్నారు ఎలికలోళ్ళు. చొప్పదంట్లలా వంగిపోయి తూలుకుంటూ ముందుకు నడిచారు. నోరు విప్పితే దవడలు పేలిపోతాయి. కాదంటే కాళ్ళూ చేతులూ విరుగుతాయి. పసిగుడ్డుకి పాలివ్వటం మర్చిపోయి బెక్కుతోంది సింగి. రెండు క్షణాల్లో సాఫయిపోయిన బాచిగాడు "ఎందుకే

ఏడుపు - ఆ జల్లెడిటియ్యి " అని నీళ్ళవైపు కెళ్ళాడు.

సంజె వేళయింది- జల్లింపు ఆపలేదు బాచిగాడు. గుడిచిమ్నీ పెట్టుకుని సూర్యకాంతం ముక్కుపుడక కోసం కుళ్ళు నీళ్ళు గాలిస్తున్నాడు. చిమ్మ చీకట్లో జరజర ఇసుక తోడ్తున్నాడు. అర్థరాత్రి గుడ్ల గూబల అరుపుకు తోడుగా చేటతో చెరుగుతున్నాడు. కప్పల బెకబెకలు, కీచురాళ్ళ అరుపులమధ్య కన్నుకానని కాళరాత్రిన కాలభైరవుడిలా వున్నాడు బాచిగాడు. నీళ్ళుడుగంటుతున్నాయి. ముక్కుపుడక దొరకలేదు. ఇసక తరగిపోతోంది. ముక్కుపుడక దొరకలేదు. చీకటెల్లిపోతే తమ ప్రాణాలు పోతాయి. జల్లించి, జల్లించి,చెరిగి చెరిగి చేతులు చచ్చుపడగా సొమ్మసిల్లి పడిపోతున్న బాచిగాడికి తెలతెలవారుతున్న సమయాన బురదలో కూరుకున్న ముక్కుపుడక తళుక్కున మెరిసింది.

"ఓల్దేవుడోవ్" అంటూ ప్రపంచాన్ని జయించినవాడిలా గావుకేక పెట్టాడు బాచిగాడు.

కోసురాయిపక్క జోగుతున్న సింగికి గుండెలవిసిపోగా లగెత్తుకొచ్చింది. బాచిగాడి నల్లటి చెక్కిళ్ళమీద కన్నీటిధారలు. సింగి భళ్లు భళ్లున నవ్వుతూ ఏడ్చింది ముక్కుపుడకని చూసి.

సూర్యుడు పదిబారల పైకి సాగాడు. ముక్కపుడక భూమయ్యగారికి ఇచ్చి వచ్చిన బాచిగాణ్ణి చూసి సింగి అడిగింది "'ఏదన్నా బహుమానం ఇచ్చారా?"

"మనకెందుకే బవుమానాలు?"

"పోనీ పప్పన్నం?"

"మంచిరాయి దొరకనీయే! మనవే పెడ్దాం అందరికీ పప్పన్నాలు" అంటూ చాటతీసుకొని నిలవ నీళ్ళదగ్గర కెళ్ళాడు.

ఆమాట చక్రవర్తి హుందాలో అన్నాడు బాచిగాడు. ఆ దరిద్ర చక్రవర్తి కలవాళ్ళ ముక్కుపుడకలు వెతికి ఇచ్చి తను రాళ్ళకోసం దేవుళ్ళాడుతున్నాడు. బాచిగాడే కాదు, అతని తాతలు తండ్రుల కాలంనుంచి ఆ వంశం రాళ్ళు జల్లిస్తూనే ఉంది రతనాలకోసం.*